క్లుప్తంగా

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టేకులపల్లి: అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం సులానగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని రైతు వేదికలో 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏఓ అన్నపూర్ణ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి..

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా ఇన్‌చార్జ్ ములకలపల్లి రవి డిమాండ్ చేశారు. టేకులపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. దివ్యాంగులు సహా చేయూత పింఛన్లు పెంచుతామని మాట తప్పారని ఆరోపించారు. కాగా, హామీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 24న కొత్తగూడెంలో నిర్వహిస్తున్న సదస్సుకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నందున పింఛన్‌దారులు పాల్గొనాలని కోరారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని 117 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు జరిగాయి. సుజాతనగర్ తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. బీఎల్ఓలకు విధుల పట్ల అవగాహన ఉండాలన్నారు. ప్రతీ ఓటరు... ఓటర్ లిస్టులో నమోదయ్యే విధంగా చూసుకోవాలని, మరణించిన, శాశ్వతంగా గ్రామం నుంచి వెళ్లిపోయిన వారిని ఓటర్ లిస్టులో నుంచి తీసివేయాలన్నారు. కొత్తగూడెం, చుంచుపల్లి డీటీలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

టీఆర్ఎస్(డీ)పార్టీ జిల్లా కమిటీ నియామకం

పాల్వంచ: తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రటిక్) ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ... పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కొత్తూరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పేరాల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బొక్కా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా భూక్యా నర్సమ్మ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగండ్ల రేణుక, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా గైని లక్ష్మీబాయి, ఉపాధ్యక్షురాలిగా చిలకబత్తిని పద్మావతి, సత్తుపల్లి ఇన్‌చార్జ్‌గా జన్నా స్వర్ణలత, మధిర ఇన్‌చార్జ్‌గా పేరాల రాంబాబులను ఎన్నుకున్నట్లు చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్(డి) గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

యువతకు ప్రాధాన్యత ఇవ్వండి..

జూలూరుపాడు: నామినేటెడ్ పదవుల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్ రాథోడ్ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం రాత్రి జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశ అనంతరం ఎమ్మెల్యేను కలిశారు. అదేవిధంగా పడమటనర్సాపురం గ్రామానికి చెందిన డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్న దామెర్ల కలప్పనకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. లేళ్ల వెంకటరెడ్డి, వెంకటనారాయణ, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు మంజూరు

పాల్వంచ: పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులు పంట రుణాలకు గాను రూ.33లక్షలు మంజూరయ్యాయని సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... ఈ వానాకాలం సీజన్‌కు డీసీసీబీ ద్వారా రైతులకు ఈ నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు కనకేష్, మోహన్‌రావు, కనగాల నారాయణరావు పాల్గొన్నారు.

విచారణ జరిపించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్య, ఎక్సైజ్ శాఖలలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. వైన్ షాపులలో దొరకని మద్యం బెల్ట్ షాపులలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా విద్యాశాఖలో అనవసర డిప్యూటేషన్లు చేశారని, ఆరోపించారు.

చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లో మద్యం, సిగరెట్లు అమ్మే షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పెరుమాళ్ల పవన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం జూలూరుపాడు హైస్కూల్, వినోభానగర్ యూపీఎస్‌లను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు.

మంత్రి గారూ.. స్పందించండి

నిధుల లేమి.. కొరవడిన పర్యవేక్షణ.. క్షేత్రస్థాయి సిబ్బంది అసంపూర్తి విధులు.. వెరసి పల్లె పాలన క్రమంగా గాడితప్పుతోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పాలకవర్గాల హయాంలో పేరుకుపోయిన బిల్లులు.. తాజాగా కార్యదర్శులు చేసిన అప్పులు.. చెల్లించాల్సిన బకాయిలు పల్లెపాలనపై తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. ఈ కారణంతో పల్లె పర్యటనకు అధికారులు ముఖం చాటేయడం సమస్యలను మరింత జటిలం చేస్తున్నాయి. నేడు ఇల్లెందుకు వస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్కకు పల్లె పాలన దుస్థితిపై ప్రజలు అందిస్తున్న విన్నపం..


పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

- నిధులు శూన్యం.. విధులు అసంపూర్ణం
- గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు
- అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న జనం
- అమాత్యా... పల్లె పాలన సాగేదెలా..?

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలకు 2023 డిసెంబర్ నుంచి ఆర్థిక సంఘం నిధులు, 2023 మార్చి నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు నిలిచిపోయాయి. కేవలం గ్రామపంచాయతీలలో పనిచేసే వర్కర్ల వేతనాలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తూ వస్తోంది. మరోవైపు పన్నుల రూపంలో వచ్చే నిధులను విడుదల చేసుకునే పరిస్థితి లేదు. గతంలో ఈ నిధులను తీర్మానంతో ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉండేది. ఈ విధానం రద్దు చేయడంతో ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో పల్లెల్లో ఏ పనిచేయాలన్నా అప్పు చేయడమో.. సొంతంగా డబ్బులు ఖర్చు చేయడమో తప్ప కార్యదర్శులకు మరో గత్యంతరం లేదు. ఇలా ఒక్కో కార్యదర్శి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారు.

గాడితప్పుతున్న పల్లె పాలన...

నిధుల లేమి సమస్య జటిలం కావడంతో ఉన్నతాధికారులు సైతం పల్లెలకు ముఖం చాటేయడం పంచాయతీలపై వారి పర్యవేక్షణ కొరడింది. ఈ–పంచాయతీ విధానం మండల కేంద్రానికే పరిమితం కావడం... టెలీ కాన్ఫరెన్స్ సౌకర్యం ఉన్నా కార్యదర్శులతో అధికారులు తరచూ సమావేశం నిర్వహించడం.. వెరసి కార్యదర్శులు పల్లెల కంటే మండల కేంద్రాలలోనే అత్యధిక సమయం గడపడంతో పల్లె పాలన గాడితప్పిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రస్తుతం పంచాయతీలలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారగా దోమలు ఉధృతమవుతున్నాయి. ఫాగింగ్ మిషన్లు మొరాయించడంతో దోమల నివారణ చర్యలు అటకెక్కాయి.

ఇంటి నంబర్ల చిక్కుముడి వీడేనా?

గ్రామపంచాయతీలకు ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. కొత్తగా నిర్మించే ఇళ్లకు నంబర్లు కేటాయిస్తూ పన్నుల రిజిస్టర్ నవీకరించడం వంటి చర్యలు గ్రామపంచాయతీల్లో నిరంతరం సాగాల్సిన ప్రక్రియ. కానీ అవి జరగడం లేదు. 2018కి పూర్వం నాటి పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేసిన ఇంటి నంబర్ల ఆధారంగానే నేడు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ జాబితాలో చాలా వరకు ఇళ్ల వివరాలు నమోదు కాలేదు. కొత్తగా నిర్మించిన ఇళ్లకు అవకాశం దొరకడం లేదు. ఇంటి పన్నుల రిజిస్టర్లు నవీకరిస్తే మరింత మందికి ప్రయోజనం చేకూరుతుంది.

ఆదాయ వనరులు నిరుపయోగం..

గ్రామపంచాయతీలు అంటే స్థానిక ప్రభుత్వాలు. ప్రభుత్వానికి ఉన్నట్లే గ్రామపంచాయతీకి కొన్ని ఆదాయ వనరులు ఉన్నాయి. కానీ ఎవరికీ పట్టకపోవడంతో అవి నిరుపయోగంగా మూలుగుతున్నాయి. పంచాయతీలలో 1998–99లలో ఇళ్ల వివరాలు రివిజన్ చేశారు. ఐదేళ్లకోసారి రివిజన్ చేయాల్సి ఉంది. కానీ ఆ ప్రక్రియను విస్మరించడంతో నేటికీ 26 ఏళ్ల నాటి జాబితా ఆధారంగానే ఇంటి పన్నులు వసూలు జరుగుతోంది. ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వే ప్రకారం మండలంలో మొత్తం 18,334 ఇళ్లు ఉండగా గతేడాది కేవలం 14,064 ఇళ్లకు మాత్రమే పన్నులు వసూలు చేశారు. ఈ లెక్కన అధికారికంగా 4,270 ఇళ్లను వదిలేసినట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం– 2018 ప్రకారం పంచాయతీలలో కాంటా రుసుము, లైసెన్స్ ఫీజులు, చేపల చెరువుల వేలం, వారాంతపు సంత, జంతు వధశాలలు తదితర అనేక మార్గాలలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పంచాయతీల ఆదాయంపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది.

సాంకేతిక నైపుణ్య శిక్షణ లేకుండానే..

వ్యవస్థలో ఒకే వ్యక్తి అన్ని పనులు నిర్వహించడం అసాధ్యం. అందులోనూ పనివిధానంలో సాంకేతిక నైపుణ్యం లేకున్నా కేవలం తెలిసి ఉండటం వల్లనే వారితో పనులు చేయించడం ప్రమాదకరం కూడా. ఇదంతా తెలిసినా పంచాయతీలలో ఎటువంటి శిక్షణ, అనుభవం లేకపోయినా మల్టీపర్పస్ వర్కర్లతో ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నారు. కానీ శిక్షణ అందించడంపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా అనేక మంది కార్మికులు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారు.


చెత్త, పిచ్చిమొక్కలతో ప్రధాన మురుగుకాల్వ


అటకెక్కిన ఫాగింగ్ మిషన్

అథ్లెటిక్ కోచ్‌కు డీవైఎస్ఓ అభినందన

కొత్తగూడెంటౌన్: అథ్లెటిక్ కోచ్ నాగేందర్ లక్ష్మీబాయి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ గ్వాలియర్ ద్వారా డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ అనాలిటిక్స్‌ను గ్రేడ్–1 లో ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు బుధవారం క్రీడలశాఖ అధికారి కార్యాలయంలో డీవైఎస్ఓ ఎం.పరందామరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గ్రేడ్–1 సాధించినందుకు కోచ్‌ను ఆయన అభినందించారు. మాట్లాడుతూ... ఈ కోర్సు క్రీడా శాస్త్రంలో ఆధునిక అంశాలపై నైపుణ్యం అందిస్తుందన్నారు. కోచ్ నాగేందర్ క్రీడల్లో మరింతగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇండియన్ టీం చీఫ్ కోచ్ నాగపూరి రమేష్, టీజీ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.యుగంధర్‌రెడ్డి, సెక్రటరీ రాజేంద్రప్రసాద్ తదితరులు నాగేందర్‌ను అభినందించారు.

నేడు జాబ్ మేళా

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం జాబ్ మేళా జరగనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో వివిధ విభాగాలలో మొత్తం 30 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. 18 – 30 సంవత్సరాల నిరుద్యోగులు సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

జూలూరుపాడు: చింతలతండా గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ బానోత్ తరుణ్ ఎనిమిది నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో తరుణ్ భార్య అనూషకు ఎన్‌పీడీసీఎల్ సుజాతనగర్ ఏడీఈ రవికుమార్ రూ.4.5 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు.

యూరియా దిగుమతి పెంచండి..

ఇల్లెందు: నానో యూరియా వాడకం పెరిగిన దృష్ట్యా సరిపడా యూరియా సరఫరా చేయాలని డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి బృందం కమిషనర్ గోపీని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జి.మునీందర్, బి.రవీందర్, నాళ్ల సోమసుందర్, యోగి, పాండయ్య తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి దిష్టిబొమ్మ దహనం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని విమర్శించడం గర్హనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో బుధవారం జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలో అధికారాన్ని దుర్వినియోగానికి పాల్పడిన జగదీశ్‌రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళి, కోనేరు పూర్ణ, చీకటి కార్తీక్, శ్రీనివాస్‌రెడ్డి, బోదాసు కనకరాజు, ఎండీ రజాక్ పాల్గొన్నారు.

19న అరుణోదయ రాష్ట్రస్థాయి సదస్సు

టేకులపల్లి: ఇల్లెందులోని పాత బస్టాండ్ ఐతా ఫంక్షన్ హాల్‌లో 19న జరగనున్న అరుణోదయ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి మెంతెన కొండలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ముత్యాలంపాడు గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం... 11 సంవత్సరాలు పాలనలో ప్రజల మౌలిక సమస్యలను పక్కనపెట్టి కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ప్రజల సొమ్మును దోచిపెట్టే ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీస్తూ విభజించు.. పాలించు అనే నీతిని బీజేపీ పాటిస్తోందని ఆరోపించారు. కోట ప్రభాకర్, సుంకరి ఉపేందర్, అవినాష్, చంద్రకళ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

టేకులపల్లి: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) టేకులపల్లి ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బోడ మంచ, డి.ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి తెలిపారు. బుధవారం టేకులపల్లిలో జరిగిన ముఖ్యుల సమావేశంలో మాట్లాడుతూ... ఇఫ్టూ సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతుందన్నారు. హమాలి, భవన నిర్మాణం, సింగరేణి, గ్రామపంచాయతీ, కేజీబీవీ, ఆశ, ఆటో అండ్ మోటార్ ఇంకా తదితర విభాగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని, ఆ వెలుగులో ఎన్నో విజయాలు సాధించిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా మూడు బిచ్చు, మేకల వినోద్, సహాయ కార్యదర్శిలుగా డేగట్టి లాలయ్య, కానుగుల వెంకన్న, కోశాధికారిగా బండారి మధు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానుగుల వెంకన్న, ధరావత్ బావుసింగ్, జినక ప్రసాద్, నాను, తార్య, లింగ, కత్తుల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సారంగపాణి

నేడు కలెక్టరేట్ ఎదుట 'నిరసన నిద్ర'

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట జరగనున్న నిరసన నిద్ర కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా పిలుపునిచ్చారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలన్నారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలని పేర్కొన్నారు.

'సీతారామ'తో జిల్లా సస్యశ్యామలం కావాలి

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు మొదలైన చోట నీరు ఇవ్వకుండా రెండు పంటలు పండే సాగర్ కెనాల్‌లోకి తరలించేందుకు ముగ్గురు మంత్రులు చేసిన కుట్రకు కొత్తగూడెం జిల్లా బలైందని బీఆర్ఎస్ నాయకుడు భూక్యా సంజీవ్ నాయక్ ఆరోపించారు. బుధవారం ఇల్లెందు గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుతో ఈ జిల్లా సస్యశ్యామలం కావాల్సి ఉందన్నారు. శంకుస్థాపన చేసిన చోట ప్రాజెక్టు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జూలూరుపాడు నుంచి ఇల్లెందుకు రావాల్సిన కాలువలో సాగర్ కాలువలో ఎలాంటి ఆటంకాలు లేవని, ఇల్లెందుకు మాత్రం రీడిజైన్ పేరుతో అంచనాలు పెంచి అటవీశాఖ ఆటంకాలు ఉన్నాయని చెప్పటం మంత్రుల కుట్రలో భాగమేనన్నారు. దీనిపై ఇక్కడి ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న సంజీవ్ నాయక్

ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్ చిత్తశుద్ధి లేని పనులకు నిదర్శనం అన్నారు. ఆర్డినెన్స్ నిలవదని తెలిసి కూడా ఎందుకు తీసుకొస్తున్నారో చెప్పాలన్నారు. ఎస్.రంగనాథ్, అబ్దుల్ నబీ, చీమల సత్యనారాయణ, బండారీ శ్రీను, వసంత్‌కుమార్, యాకూబ్, ఉపేందర్, లలిత్‌పాసీ, రాజేష్, చిన్నారి, యాకయ్య, మహేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

సింగరేణి(కొత్తగూడెం): కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. బుధవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న పర్సనల్ విభాగం, సింగరేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ... విధులకు గైర్హాజరయ్యే కార్మికులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. అనంతరం సింగరేణి డైరెక్టర్(పా) కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి మాట్లాడుతూ... గైర్హాజరవుతున్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని, కారుణ్య నియామకం ద్వారా నియమితులైన మహిళా ఉద్యోగులకు పనులు కేటాయించాలని, ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులకు సీఎంపీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ క్లెయిమ్స్ క్లియర్ చేయాలని సూచించారు.

సీపీఆర్ఎంఎస్, మెడికల్ కార్డులు, కారుణ్య నియామకాలు, ఏరియాల వారీగా క్వార్టర్ల వివరాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో 11 ఏరియాల పర్సనల్ విభాగం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజ్యాంగ మూలాలు కాపాడాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎస్కె ఫహీందాదా మాట్లాడుతూ... దేశంలో 11 సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ నిరుద్యోగ యువతకు మొండిచేయి చూపుతోందని విమర్శించారు. నూతన విద్యాచట్టాన్ని 2020 నుంచి అమలు చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బేటీ పడావో... బేటీ బచావో అని నినాదం చెబుతున్న మోదీ ప్రభుత్వంలో ఆబేటీలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూం, మోతె కృష్ణ, జావెద్, డి.వంశీ, రవి, అష్రాఫ్, బాలు, చరణ్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించండి..

జూలూరుపాడు: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డికి ఉపాధి సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించలేక తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వేతనాలు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, టీఏలు ప్రసాద్, నాగమణి, నాగరాజు, వీరభద్రం, జోదాబాయి, సీఓలు రవికుమార్, కృష్ణప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాములు ఉద్దేశపూర్వకంగా కాటు వేయవు..


పార్కులో అవగాహన కల్పిస్తున్న సంతోష్

కొత్తగూడెంఅర్బన్: పాములు ఎవరినీ ఉద్దేశపూర్వకంగా కాటు వేయవని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ అన్నారు. బుధవారం ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కే.సుజాత సూచన మేరకు ప్రాణధార ట్రస్ట్ సభ్యులు మహేష్, ముజఫర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రాజీవ్ పార్క్‌లో వాకర్స్‌తో, రామవరంలోని ఏకలవ్య స్కూల్‌లో, పాత కొత్తగూడెం తెలంగాణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విషసర్పాలు ప్రదర్శించి, మాట్లాడారు. సర్పాలు జీవవైద్యంలో భాగమని, ఔషధాల తయారీకి పాము విషమును ఉపయోగిస్తారని గుర్తించి వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లో పామును చేర్చారని వివరించారు. కీటకాలు, మిడతలు, కప్పలు, ఎలుకలు, పందికొక్కులు వంటి వాటి నియంత్రణకు తోడ్పడతాయని, అన్ని పాములు విషపూరితం కావని చెప్పారు. పాము కాటు వేస్తే చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అహ్మద్, అశోక్, ఇంజనీర్ వీరభద్రాచారి పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల్లో సమస్యలు

- అవస్థలు పడుతున్న ప్రజలు, వైద్యసిబ్బంది
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థలో ఉన్న జూలూరుపాడు హెల్త్ సబ్ సెంటర్ భవనం


ప్రహరీ లేని పడమటనర్సాపురం హెల్త్ సబ్ సెంటర్

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. పాపకొల్లు, జూలూరుపాడు, అన్నారుపాడు, భేతాళపాడు, కొమ్ముగూడెం, పడమటనర్సాపురం, కాకర్ల, అనంతారం, గుండెపుడి ఆరోగ్య ఉపకేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు, వైద్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆయా కేంద్రాల్లో కనీస వసతులు తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదు. ప్రహరీ లేకపోవడంతో భద్రత కూడా కరువైంది. హెల్త్ సబ్‌సెంటర్లకు వ్యాక్సినేషన్, వైద్య పరీక్షల నిమిత్తం గర్భిణులు, చంటి పిల్లల తల్లులు వస్తుంటారు, అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగరు, కాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు, నడుము నొప్పులు, ఎన్‌సీడీ పరీక్షలతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే ప్రజలు ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు పొంది, మందులు తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో వైద్యచికిత్సకు వచ్చిన గర్భిణులు, బాలింతలు, పిల్లలు, వృద్ధులు, మహిళలతోపాటు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదేవిధంగా హెల్త్ సబ్‌సెంటర్లలో టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ చెప్పుకోలేని ఇబ్బంది పడుతున్నారు. తొమ్మిది హెల్త్ సబ్‌సెంటర్లలో ఆరింటిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మండల కేంద్రంలోని హెల్త్ సబ్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో భవనాన్ని ఖాళీ చేసి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి మార్చి అక్కడే ఏఎన్ఎంలు వైద్యసేవలు అందిస్తున్నారు. కాకర్ల, కొమ్ముగూడెం హెల్త్ సబ్ సెంటర్లు శిథిలావస్థ భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతోపాటు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 9 హెల్త్ సబ్‌సెంటర్లలో అనంతారం హెల్త్ సబ్ సెంటర్‌కు ప్రహరీ ఉండగా, మిగిలిన ఎనిమిది సెంటర్ల భవనాలకు ప్రహరీ లేదు. అన్నారుపాడు, భేతాళపాడు హెల్త్ సబ్ సెంటర్లకు వెళ్లే దారి కూడా సక్రమంగా లేదు. వర్షం కురిస్తే దారంతా బురదమయంగా మారుతుంది. అన్నారుపాడు హెల్త్ సబ్‌సెంటర్ భవనం మరమ్మతులకు గురైంది.

భవనం గోడలు బీటలు రాగా, ఫ్లోరింగ్ కుంగిపోయింది. జూలూరుపాడు, పడమటనర్సాపురం ఆరోగ్య కేంద్రాల వద్ద వర్షం నీరు నిలుస్తోంది. హెల్త్ సబ్‌సెంటర్లు సమస్యలతో సతమతం అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు సంబంధిత అధికారులు పట్టించుకోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హెల్త్ సబ్‌సెంటర్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఆరోగ్య ఉపకేంద్రాల్లోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. జూలూరుపాడు, కాకర్ల, కొమ్ముగూడెం హెల్త్ సబ్ సెంటర్ల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. జూలూరుపాడు హెల్త్ సబ్ సెంటర్ భవనం ప్రమాదకరంగా ఉండటంతో పీహెచ్‌సీలోకి మార్చడం జరిగింది. నూతన భవనాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాము. హెల్త్ సబ్‌సెంటర్లలో తాగునీటి సమస్యకు చర్యలు తీసుకుంటాము.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ జూలూరుపాడు